ఆంధ్రజ్యోతి
కరీంనగర్
మంగళవారం 15 అక్టోబరు 2024



గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సత్తు మల్లయ్య

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సత్తు మల్లయ్య బాధ్యతల స్వీకరణ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సత్తు మల్లయ్య సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా గ్రంథాలయంలోని తన చాంబర్‌లో నియామక పత్రంపై, హాజరు పట్టీలో సంతకం చేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ తనను ఈ పదవిలో నియమించిన సీఎం రేవంత్‌రెడ్డికి, సహకరించిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. చొప్పదండి, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మేడిపెల్లి సత్యం, చింతకుంట విజయరమణారావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ సత్తు మల్లయ్యకు పుష్పగుచ్ఛాలు, శాలువాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్, వంగల విద్యాసాగర్, గంగుల ప్రదీప్‌కుమార్, సిరిపురం లావణ్య, నాగప్రసాద్, కె రాంరెడ్డి, సాయిని తిరుపతి, మాదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.



అందుబాటులోని లేని మత్తు వైద్యుడు

- హుజూరాబాద్ ఆస్పత్రిలో ప్రసవం కోసం గర్భిణుల పడిగాపులు
- 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన వైద్యులు

7



మంచినీటి సహాయకులొస్తున్నారు

- రక్షిత తాగునీటి సరఫరాకు శిక్షణ...
- పరిష్కారం కానున్న నీటి సమస్యలు

7

స్మార్ట్ కార్డుల కొరత

- గత నెల 29 నుంచి నిలిచిన ఆర్సీల ప్రింటింగ్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇబ్బందులు



6

ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం

340 కేంద్రాల ఏర్పాటుకు రంగం సిద్ధం

- 5.07 లక్షల మెట్రిక్ టన్నుల ధిగుబడి అంచనా
- 4.14 టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వానా కాలం వరి ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో రెండు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. ఈ సీజన్‌లో 5.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లావ్యాప్తంగా 340 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్‌గా ఇస్తున్నందున ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. వానా కాలంలో జిల్లాలో 2,75,448 ఎకరాల్లో వరిసాగు చేశారు. వీటిలో 1,56,948 ఎకరాల్లో దొడ్డు రకాలు, 1,18,500 ఎకరాల్లో సన్న రకాలను వేశారు. ప్రభుత్వం సన్నరకాల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించి క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ప్రకటించడంతో ఈసీజన్‌లో 40 శాతానికిపైగా సన్నరకాలను సాగు చేశారు. దొడ్డు రకాలకు చెందిన వరి ధాన్యం దిగుబడి ఎకరాకు 2.092 టన్నులు, సన్నరకాలు 2.047 టన్నులు వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ మేరకు 3,28,335 మెట్రిక్ టన్నుల దొడ్డు వరి ధాన్యం, 2,42,570 మెట్రిక్ టన్నుల సన్న రకం వరి ధాన్యం దిగుబడి రానున్నది. దొడ్డురకాలు మొత్తంగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించనుండగా సన్నరకాలలో 55,374 మెట్రిక్ టన్నులు రైతులు విత్తన అవసరాల కోసం, 75,471 టన్నులు స్థానిక అవసరాల కోసం ఉంచుకొని 1,11,725 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తారని అంచనా వేశారు.

● కొనుగోలు కేంద్రాలకు ఏర్పాట్లు

జిల్లాలో రైతులు మొత్తంగా 4,14,282 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించే అవకాశముండడంతో వీటిని కొనుగోలు చేయడానికి 340 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 238 కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 51 కొనుగోలు కేంద్రాలు, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 47 కొనుగోలు కేంద్రాలు, హాకా ద్వారా 4 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కరీంనగర్ రూరల్ మండలంలో 20 కొనుగోలు కేంద్రాలు, కొత్తపల్లిలో ఏడు, మానకొండూర్‌లో 30, గన్నేరువరంలో 16, తిమ్మాపూర్‌లో 22, చిగురుమామిడిలో 21, చొప్పదండిలో 26, గంగాధరలో 34, రామడుగులో 24, శంకరపట్నంలో 23, సైదాపూర్‌లో 30, వీణవంకలో 24, హుజురాబాద్‌లో 24, జమ్మికుంటలో 29, ఇల్లందకుంటలో 10 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320, కామన్ రకానికి రూ.2300 మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించింది. ఏ-గ్రేడ్ ధాన్యంగా కొనుగోలు చేసే సన్నరకం వరి ధాన్యానికి 2320 రూపాయలతోపాటు 500 రూపాయల బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్నది. అక్టోబరులో 23శాతం (సుమారు లక్ష మెట్రిక్ టన్నులు(, నవంబరులో 58 శాతం (2.35 లక్షల మెట్రిక్ టన్నులు), డిసెంబర్, జనవరిలో మిగతా 20శాతం (సుమారు 75 వేల మెట్రిక్ టన్నులు) ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నారు. దొడ్డు రకాల్లో మిల్లర్లు 25 వేల మెట్రిక్ టన్నులకుపైగా, అలాగే సన్న రకాలలో సుమారు 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రైసు మిల్లర్లు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా ఎక్కువ డబ్బు ఇచ్చేఅవకాశం ఉన్నందున ఈ అంచనాలు మరింత పెరుగవచ్చని భావిస్తున్నారు.





రేణికుంటలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

● గోనె సంచులే సమస్య....

మార్కెట్‌కు వస్తుందని భావిస్తున్న నాలుగు లక్షలపై చిలుకు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల కోసం కోటి గోనె సంచులు అవసరమవుతాయని అంచనా వేశారు. 54 లక్షల కొత్త సంచలు, 46 లక్షల పాత సంచులతో అవసరాలు తీర్చవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 17,95,705 సంచులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇంకా 82,04,295 సంచులు అవసరమవుతాయి. ఈ సంచులు సమకూర్చకపోతే కొనుగోళ్లు నిలిచిపోయే అవకాశమున్నది. నవంబరులోనే 50 శాతానికిపైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశమున్నది. 6,755 టార్పాలిన్లు, 402 మాయిశ్చర్ మిషను, 750 కాంటాలు, 358 ప్యాడీ క్లీనర్లు, 340 సన్నవరి ధాన్యాన్ని గుర్తించే యంత్రాలు, 340 ధాన్యం ఆరబెట్టే యంత్రాలు అవసరమని గుర్తించారు.

● గోదాముల కొరత

రైతులనుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఈసారి మిల్లర్లకు కేటాయించవద్దని పౌరసరఫరాలశాఖ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో గోదాముల కొరత ఏర్పడే అవకాశమున్నది. జిల్లాలో సెంట్రల్ వేర్‌హౌస్ కార్పొరేషన్, స్టేట్ వేర్‌హౌస్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, మార్కెట్ కమిటీలు, ఇన్వెస్టర్ గోడౌన్లు కలిపి 3,47,018 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వచేసే స్థలం ఉండగా 2,00,959 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇప్పటికే నిల్వ ఉంది. ప్రస్తుతం 1,46,059 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే స్థలం మాత్రమే అందుబాటులో ఉన్నది. నాలుగు లక్షలకు పైచిలుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తే వాటిని అనివార్యంగా మిల్లర్లకు ఇస్తారా లేక వేరే ఏర్పాట్లు చేస్తారా అన్నది తేలాల్సి ఉన్నది.

'వర్గీకరణ తరువాతే నియామకాలు చేపట్టాలి'

సుభాష్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్ర జ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తరువాతనే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని ఎస్సీ మాదిగ ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్, ఫార్మసిస్టు అసోయేషన్ బాధ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీ, బీస్సీ పూర్తి చేశామని తెలిపారు. కొద్ది రోజుల క్రితం ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, నర్సింగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఎస్సీల్లోని అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తరువాతనే ఉద్యోగాల నియామక ప్రక్రియ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీ ఎస్ జిల్లా అధికార ప్రతినిధి దండు అంజయ్య, వి సంపత్, సంపతి అశోక్, కె ఆంజనేయులు, కె అమన్ కుమార్, జె నరేష్, కె నిర్మల పాల్గొన్నారు.

26 నుంచి రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఓక్యులో ప్లాస్టీ సేవలు

భగత్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్ర జ్యోతి): రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఈ నెల 26 నుంచి ఓక్యులో ప్లాస్టీ సేవలు ప్రారంభిస్తున్నట్లు ఆసుపత్రి చైర్మన్, ట్రస్టుబోర్డు సభ్యుడు కొండావేణుమూర్తి తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కంటి క్యాన్సర్‌కు సంబంధించి కనురెప్పలు, కన్నీటి వాహిక అడ్డంకులు, కక్ష్య పగుళ్లు, కళ్ల చుట్టూ కణుతుల సమస్యలు ఉన్న వారు ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో ట్రస్టు బోర్డు సభ్యులు చిదుర సురేష్, ప్రకాశ్‌హోల్లా, బొమ్మ పవన్‌కుమార్, కోల అన్నారెడ్డి, టి మురళీధర్‌రావు పాల్గొన్నారు.

రేణికుంట టోల్ గేట్ వద్ద కొనసాగిన వాహనాల రద్దీ

తిమ్మాపూర్, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి): దసరా పండుగ సందర్భంగా గ్రామాలకు తరలి వచ్చిన వారు హైదారాబాద్‌కు వెళుతుండడంతో మండలంలోని రేణికుంట ఉన్న టోల్ గేట్ వద్ద రెండో రోజు సోమవారం వాహనాల రద్దీ కొనసాగింది. సోమవారం తెల్లవారు జాము నుంచే హైదారాబాద్ వైపునకు వెళ్లే వాహనాలు టోల్ గేట్ వద్ద 500 మీటర్ల మేర నిలిచిపోయాయి. టోల్ గేట్ నిర్వాహకులు చిన్న వాహనాలను పక్క నున్న లైన్ నుంచి ఫ్రీగా పంపించారు. రద్దీ పెరగడంతో టోల్ గేట్ నిర్వహకులు అప్రమత్తం అయి అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాలను త్వరత్వరగా పంపించి వేశారు.

బస్‌స్టేషన్‌లో రద్దీ

భగత్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా స్వగ్రామాలకు వచ్చిన వారు తిరిగి వెళుతుండడంతో కరీంనగర్ బస్టాండ్‌లో సోమవారం రద్దీ పెరిగింది. ప్రయాణికుల రద్దీని కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత పరిశీలించారు. ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించాలని బస్‌స్టేషన్ ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ సురేష్, స్టేషన్ మేనేజర్ ఎస్ అంజయ్యకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఎం సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, కరీంనగర్-1 డిపో మేనేజర్ ఐ విజయమాధురి పాల్గొన్నారు.

దసరా ధమాకా....

- జిల్లాలో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు



కరీంనగర్ క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వేళ జిల్లాలో మద్యం ఏరులైపారింది. దసరాకు ఇతర రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వాళ్లంతా కుటుంబంతో స్వగ్రామాలకు వచ్చి దసరా వేడుకలను ఘనంగా జరుపుకుంటారు. దసరా అంటేనే మందు, మాంసంతో విందులు.. శనివారం దసరా పండుగ రావడంతో కొందరు మద్యం, మాసం ముట్టుకోకుండా ఆదివారం దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. మరికొందరు అర్ధరాత్రి 12 గంటల తరువాత మద్యం సేవించి వేడుకలను ఘనంగా జరిపారు. దసరా పండుగ వేళ జిల్లాలో ఈ నెల 10వ తేదీన 6 కోట్ల రూపాయలు, 11న 5 కోట్ల రూపాయల మద్యం అమ్మకాలు జరిగాయి. జిల్లాలో 94 వైన్స్, 32 బార్లు ఉన్నాయి. శని, ఆదివారం సెలవు దినాలతో మద్యం రిటైలర్లు 10, 11వ తేదీల్లోనే మద్యం డిపో నుంచి స్టాక్‌ను కొనుగోలు చేశారు. కరీంనగర్ మద్యం డిపో నుంచి కరంనగర్, జగిత్యాల జిల్లాల్లోని వైన్‌షాపులు, బార్‌లన్నిటింకి మద్యం సరఫరా అవుతుంది. పెద్దపల్లి జిల్లాలోని 50 శాతం వరకు షాపులకు ఇక్కడి నుంచే మద్యం సరఫరా అవుతున్నది. కరీంనగర్ మద్యం డిపో నుంచి మూడు జిల్లాల్లోని 192 వైన్స్, 56 బార్లకు రికార్డు స్థాయిలో మద్యం సరఫరా అయింది. ఈ నెల 10న 9.5 కోట్లు, 11న 13 కోట్ల రూపాయల అమ్మకాలు జరిగాయి. 10న 8,600 పెట్టెల లిక్కర్, 18 వేల పెట్టెల బీర్ల అమ్మకాలు జరిగాయి. 11న 10 వేల పెట్టెల లిక్కర్, 26 వేల పెట్టెల బీరు అమ్మకాలు జరిగాయని డిపో అధికారులు వెల్లడించారు.

పత్తి ధరలు పతనం

- ఆందోళనలో రైతులు



పత్తి బేళ్లు (ఫైల్)

జమ్మికుంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో పత్తి ధరలు పతనమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం వరకు 7,500 రూపాయల పైచిలుకు పలికిన తెల్ల బంగారం ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గిందని చెబుతున్న వ్యాపారులు ధరల్లో కోతలు మొదలు పెట్టారు. క్వింటాల్ పత్తికి 7,521 రూపాయలుగా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. జమ్మికుంట మార్కెట్లో గత బుధవారం 6,750 రూపాయల ధర పలికింది. దసరా సందర్భంగా గురువారం నుంచి మార్కెట్‌కు సెలవులు ఇచ్చారు. మంగళవారం నుంచి పత్తి కొనుగోళ్లు పునఃప్రారంభం కానున్నాయి. గత నెల 25 నుంచి కొత్త పత్తి రావడం ప్రారంభమైంది. అప్పటి వరకు పాత పత్తికి వ్యాపారులు 7,600 రూపాయల వరకు చెల్లించారు. దసరా పండగకు ముందు ఆర్థిక అవసరాల నిమిత్తం రైతులు పత్తిని విక్రయించేందుకు ఆసక్తి కనబరిచారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్ధతు ధర వచ్చిణాపర్వాలేదని భావించిన రైతులకు మార్కెట్లో వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. గ్రేడ్ ఏ రకం పత్తికి వ్యాపారులు 6,750 రూపాయలకు మించి ధర చెల్లించడం లేదు. మద్ధతు ధర కంటే 771 రూపాయలు తక్కువ చెల్లిస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త పత్తికి అంతకన్న మించి ధరలు చెల్లించలేమని వ్యాపారులు అంటున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోళ్లు ప్రారంభిస్తేనే మద్దతు ధర వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి సీసీఐ కొనుగోళ్లను త్వరగా ప్రారంభించాలని పత్తి రైతులు కోరుతున్నారు.



జిన్నింగ్ మిల్లుల్లో పత్తి (ఫైల్)

బోసిపోయిన రవాణా శాఖ కార్యాలయం



తిమ్మాపూర్, అక్టోబరు 14(ఆంధ్ర జ్యోతి): అసలే సోమవారం.. రెండు రోజుల సెలవు తర్వాత కార్యాలయం తెరుచుకుంది.. వాహనదారులతో కిటకిటలాడాల్సిన జిల్లా రవాణా కార్యాలయం బోసిపోయింది. మండల కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయం సోమవారం ఖాళీగా కనిపించింది. దసరా పండగతోపాటు రెండో శనివారం, ఆదివారం రెండు రోజులు వరుసగా సెలవులు వచ్చాయి. మామూలు పరిస్థితుల్లో సోమవారం రవాణాశాఖ కార్యాలయానికి రద్దీ పెరుగుతుంది. అందుకు భిన్నమైన పరిస్థితి కనిపించింది. ప్రతి రోజు 500కు పైగా దరఖాస్తులు వచ్చేవి. సోమవారం అన్ని కలిపి 250 దరఖాస్తులు కూడా రాలేదు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ముస్తాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించే క్రికెట్ పోటీలకు స్థానిక మహర్షి పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న కొండం సాయి తేజాగౌడ్ ఎంపికయ్యాడు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అండర్-14 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరి చాడు. ష్టస్థాయి ఎ తోట ధర్మేందర్, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

సిరిసిల్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్స వాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూడు వాహనాలపై స్వామివారి శోభాయాత్ర నిర్వహించారు. ఉదయం సూర్యవాహనం, సాయంత్రం రంగనాయక తిరుప్పాలం, రాత్రి చంద్రవాహనంపై ఊరేగించారు.



న్యూస్ బాక్స్

ఉద్యోగాల భర్తీకి 17న ఇంటర్వ్యూలు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 14: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఈనెల 17న ఉదయం 9 గంటలకు హోటల్ శ్వేతలో దుబాయ్‌లో ఉద్యోగాల భర్తీ కోసం ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, టామ్‌కామ్ సీఈవో ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. దుబాయ్‌లో బైక్ రైడర్స్ (డెలివరీ బాయ్స్)కి అధిక డిమాండ్ ఉందని అన్నారు. ఆకర్షణీయమైన జీతం, చట్టబద్ధమైన వలస మార్గాల ద్వారా భర్తీ ప్రక్రియను సులభతరం చేయడంలో టామ్‌కామ్ అభ్యర్థులకు సహాయం చేస్తుందని అన్నారు. ఎస్సెస్సీ ఉత్తీర్ణులై పాస్‌పోర్టు, మూడు సంవత్సరాల ఇండియన్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి 21 నుంచి 40 సంవత్సరాలలోపు వయస్సుతో పాటు జోమాటో, స్విగ్గీ, మరేదైనా ఫుడ్ డెలివరీలో అనుభవం ఉన్న వారికి ఉద్యోగ భర్తీలో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. అర్హత కలిగిన వారు 9440061285, 9440048500, 9701040062, 9440051452 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశానికి నేడు తుది గడువు

గణేశ్‌నగర్, అక్టోబరు 14: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు మంగళ వారం తుది గడువని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వరలక్ష్మి, కోఆర్డినేటర్ డా.మనోజ్‌కుమార్ సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీ డియట్ ఓపెన్‌స్కూల్, ఐటీఐ, డిప్లొమా విద్యార్థులు, టీఎస్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసి రశీదు పొందాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 7382929755 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎల్ఎల్ఎం ఫలితాలు విడుదల


గణేశ్‌నగర్, అక్టోబరు 14: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు 2024లో నిర్వహించిన ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం శాతవాహన విశ్వ విద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూని వర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in.లో చూసుకోవచ్చని తెలిపారు.

అలసిపోతున్న పోలీసన్న..

- హామీగానే మిగిలిపోయిన వారాంతపు సెలవు
- పూర్తి స్థాయి సిబ్బందిని భర్తీ చేస్తేనే సాధ్యం...
- పట్టణాల్లో 16 గంటలు, మండలాల్లో 24 గంటల విధులు

ఉద్యోగపర్వం





రోజుకు 16 గంటలు, అవసరం ఉన్నప్పుడు 24 గంటలు.. ఇలా పోలీసులు అలుపెరుగకుండా విధులు నిర్వహిస్తూనే ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు అంటున్నట్లు పోలీసులకు వారాంతపు సెలవు అమలుకావడం లేదు. రాత్రనకా.. పగలనకా పని చేస్తున్న పోలీసులు అలసిపోతున్నారు. ఇది వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది.

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 14: పోలీసులకు వారాంతపు సెలవు హామీగానే మిగిలి పోయింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చినా అది అమలుకు నోచుకోలేదు. గతంలో ఉమ్మడి జిల్లాలో కొన్ని రోజులు, కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు చేసిన తర్వాత 2021-22లో మూడు నెలలు మాత్రమే పోలీసులకు వారాంతపు సెలవులు అమలు చేశారు. ఆ తర్వాత అమలు చేయక చేతులెత్తేశారు. వారాంత సెలవు ఇవ్వాలని పోలీసు అసోసి యేషన్లు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. పోలీసు శాఖలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు తగిన సిబ్బంది లేక, ఎమర్జెన్సీ సర్వీసులు అందించాల్సిన బాధ్యతా యుతమైన ఉద్యోగులు కావడంతో ప్రభుత్వాలు వారాంత సెలవు డిమాండ్‌ను పక్కనపెడుతూ వస్తున్నాయి. హైదరాబాద్ జంట నగరాల్లో 3, 4 సెక్షన్లలో విధులను అమలు చేస్తున్నారు. దీంతో అక్కడి పోలీసులకు కొంత వెసులుబాటు లభిస్తుండగా కరీంనగర్, జగిత్యాల, గోదావరిఖని వంటి నగరాలలో రెండు, మూడు సెక్షన్ల డ్యూటీలను అమలు చేస్తున్నారు. దీంతో పోలీసులు రోజుకు దాదాపు 16 గంటలపాటు విధులు నిర్వహిస్తున్నారు. ఇక బందోబస్తులున్న రోజుల్లో 24 గంటల విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఇక గ్రామీణ ప్రాంతాల స్టేషన్లలో పని చేస్తున్న వారు 24 గంటలపాటు విధులు నిర్వహిస్తున్నారు.

500 మందికి ఒక పోలీసు..

ప్రతి 500 జనాభాకు ఒక పోలీసు నిష్పత్తిలో సిబ్బంది ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. కరీంనగర్ జిల్లా జనాభా 10 లక్షలపైగా ఉండగా పోలీసుశాఖలో 1500 వరకు సిబ్బంది ఉన్నట్లు సమాచారం. జిల్లాలో రోజు రోజుకు నేరాల సంఖ్య పెరుగుతుండడం, నగరం, పట్టణాల విస్తీర్ణం పెరుగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో సమాజంలో శాంతిభద్రతల సమస్యలను కాపాడడంలో పోలీసులు శక్తికి మించి, నిర్దిష్ట సమయానికి మించి శ్రమిస్తున్నారు. వారాంతపు సెలవులు లేకుండా నిర్విరామంగా ఏడు రోజుల పాటు పని చేస్తుండడంతో పని భారం ఎక్కువవుతున్నది. వారాంతపు సెలవు ఇవ్వడంతో కొంత విశ్రాంతి లభించడం ద్వారా విధి నిర్వహణలో మరింత నైపుణ్యాన్ని చాటే అవకాశముంది.

నా జర్నీ తిరిగి ప్రారంభమైంది..

చిట్‌చాట్



కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సంస్థ చైర్మన్ బాధ్యతలు స్వీకరించడంతో నా జర్నీ కరీంనగర్‌లో తిరిగి స్టార్ట్ అయ్యింది. నేను గంగాధర మండలం కొలిమికుంట గ్రామానికి చెందిన సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చాను. డిగ్రీ తర్వాత విద్య విలువ తెలిసింది. పట్టుదలతో చదివి ఎంకామ్, పిహెచ్‌డీ పూర్తి చేశాను. కీ టూ సక్సెస్ ఫర్ కామర్స్ అనే బుక్ రాశాను. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా నెలకు రూ. 1.5 లక్షలు సంపాదించాను. ఆ ఉద్యోగాన్ని వదిలి 2013లో రాజకీయాల్లోకి వచ్చాను.

నా రాజకీయ జీవితమంతా ఆదిలాబాద్ జిల్లాతో ముడి పడి ఉంది. అందుకే కరీంనగర్‌తో తక్కువ పరిచయం ఉంది. చిత్తశుద్ధి, నిజాయితీ, బాధ్యతతో పని చేయడం నా నైజం. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కావాలని అడుగలేదు. వద్దని అనలేదు. అందరికీ అందుబాటులో ఉండి రాజకీయ పరంగా ప్రభుత్వం తరపున సహాయం అందించేందుకు కృషి చేస్తాను. త్వరలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి అన్ని వివరాలు తెలుసుకుంటా. బడ్జెట్ ఉన్నా లేకున్నా నెల రోజుల్లో పోటీ పరిక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు20 లక్షల రూపాయలతో మెటీరియల్ అందజేస్తా.

- మీడియాతో చిట్‌చాట్‌లో కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య

రాజన్న ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి



పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, యాదాద్రి తరహాలో రాజన్న ఆలయాన్ని తీర్చిదిద్దుతామని దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మనువడి పుట్టు వెంట్రుకల కార్యక్రమంలో భాగంగా సోమవారం కుటుంబ సమేతంగా రాజన్నను దర్శించుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, ఈ నెల లేదా వచ్చే నెలలో సమావేశం ఏర్పాటు చేయనున్నారని తెలిపారు.

యాదాద్రి ఆలయం మాదిరి గానే రాజన్న ఆల యాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. యాదాద్రికి 63 కిలోల బంగారు తాపడం చేయడానికి జీవో మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం వేములవాడ రాజన్న ఆలయానికి సంబంధించి 65 కిలోల బంగారం, 5 వేల కిలోల వెండి ఉందని, రాజన్నకు సైతం బంగారు తాపడం, ఉత్సవ విగ్రహాలు, పల్లకి వంటి వాటిని వెండితో తయారు చేయించి ప్రత్యేక తీసుకొస్తామని అన్నారు. ఆమెతోపాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

రాజన్న సేవలో మంత్రి

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ దర్శించుకున్నారు. సోమవారం మధ్యాహ్నం రాజన్న ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆమెకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. రాజన్న ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించుకున్నారు.

రాజన్న ఆలయ అధికారుల అత్యుత్సాహం

మంత్రి రాకతో స్వామివారికి అరగంట ఆలస్యంగా నైవేద్యం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. సోమవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రాజన్న ఆలయానికి కుటుంబసమేతంగా వచ్చారు. ఆలయ గెస్ట్‌హౌస్‌లో మనుమడి తలనీలాలు సమర్పించి మధ్యాహ్నం 3 గంటలకు రాజన్న దర్శనానికి వెళ్లారు. ద్వాదశి సందర్భంగా అధికారులు 3 గంటలకు స్వామివారికి నైవేద్యం, అన్నపూజ కార్యక్రమాన్ని నిర్వహించాలి. అదే సమయంలో మంత్రి దైవ దర్శనానికి రావడంతో చేసేదేమీ లేక అధికారులు మంత్రి కొండా సురేఖ ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. రాజన్నకు 3 గంటలకు నిర్వహించాల్సిన నైవేద్యం, అన్నపూజ కార్యక్రమాన్ని అరగంట ఆలస్యంగా నిర్వహించారు. రాజన్నకు సమర్పించే నైవేద్యం ఆలస్యమవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆలయాధికారులను వివరణ కోరగా స్వామివారికి నైవేద్యం, అన్నపూజ కార్యక్రమం నిర్వహించడం కాస్త ఆలస్యమైందని తెలిపారు. ద్వాదశి సందర్భంగా 5 గంటలకు వరకు నైవేద్యం పెట్టవచ్చని పేర్కొన్నారు.

చెక్ డ్యాంలలో ఇసుక మేటలు



పేరుకుపోయిన ఇసుక

కరీంనగర్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నీటిని ఒడిసి పట్టి, తాగు, సాగు నీటి సమస్యలను పరిష్క రించేందుకు కరీంనగర్ నియోజకవర్గంలో ఎనిమిది చెక్ డ్యాంలను నిర్మించారు. ఆ చెక్‌డ్యాంలలో ఇసుక పేరుకుపోవడంతో నీరు నిలవడం లేదు. కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలో వాగుపై ఐదు సంవత్సరాల క్రితం చెక్ డ్యాంను నిర్మించారు. ఈ చెక్ డ్యాంలో ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతోంది. ఇసుక పేరుకు పోవడంతో నీరు చెక్ డ్యాంలో నిలువలేక దిగువకు వృథాగా పోతోంది. ఈ చెక్‌డ్యాంలో నీరుంటే నగునూర్, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్ గ్రామాల్లోని రైతులకు సాగునీటి ఇబ్బంది ఉండేది కాదు. చెక్ డ్యాంలో పేరుకుపోయిన ఇసుకను తొలగించి నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నగునూర్ చెక్ డ్యాం



స్మార్ట్ కార్డుల కొరత

- గత నెల 29 నుంచి నిలిచిన ఆర్సీల ప్రింటింగ్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇబ్బందులు

ఈ నెల 11వ తేది వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిలిచిన స్మార్ట్ కార్డుల వివరాలు

కార్యాలయం	ఆర్సీ	డ్రైవింగ్ లైసెన్స్
కరీంనగర్	789	249
పెద్దపల్లి/ రామగుండం	360	545
రాజన్న సిరిసిల్ల	00	186
జగిత్యాల/ కోరుట్ల	1483	696
మొత్తం	2,632	1676



పోస్ట్ చేసేందుకు సిద్ధంగా ఉన్న డ్రైవింగ్ లైసెన్స్‌లు



ఆర్సీ కార్డులు(ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖా కార్యాలయాల్లో స్మార్ట్ కార్డుల కొరత వాహనదారులకు ఇబ్బందిగా మారింది.. వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకొని, డ్రైవింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు సకాలంలో కార్డులు లభించక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరీంనగర్‌లో డీటీసీ కార్యాలయం, హుజూరాబాద్, పెద్దపల్లి, రామగుండం, సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్లలో ఆర్టీవో కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు కోసం రోజుకు వెయ్యి వరకు దరఖాస్తులు వస్తుంటాయి. ఆయా కార్యాలయాల్లోనే సిబ్బంది కార్డులు ప్రింట్ చేసి పోస్ట్ చేస్తారు. కార్డులు జారీ అయిన 15 రోజుల్లో వాహనదారులకు చేరాలి. స్మార్ట్ కార్డుల కొరత కారణంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నెల 29 నుంచి ఆర్సీ కార్డుల ప్రింటింగ్ నిలిచిపోయింది. డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు కొన్న ఉండడంతో వాటిని నెట్టుకొస్తున్నారు. అవీ త్వరలో నిలిచేపోయే అవకాశం ఏంది. ఆర్సీ కార్డుల కొరత వల్ల కొత్త వాహనాలకు నంబర్ ప్లేట్లను బిగించడానికి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ఆర్టీఏ ఎం-వాలెట్‌పై అవగాహన కరువు

రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖ ఆధ్వర్యంలో ఎం-వాలెట్‌ను అందుబాటులో తీసుకువచ్చి చాలాకాలం కావస్తున్నా వాహనదారులకు అవగాహన రాలేదు. ఎం వాలెట్‌లో ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్స్ డౌన్‌లోడ్ చేసుకుంటే ఎవరైనా వాహనాలు ఆపినప్పుడు వాటిని చూపించే అవకాశం ఉంటుంది.

త్వరలో స్మార్ట్ కార్డులు అందుబాటులోకి వస్తాయి

డీటీసీ పి పురుషోత్తం



రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ కార్డుల కొరత ఉంది. రవాణా శాఖ ఆధ్వర్యంలో కొత్తగా టెండర్లు పిలిచారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో 60 వేల స్మార్ట్ కార్డులు అందుబాటులోకి వస్తాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు రెండు, మూడు రోజుల్లో స్మార్ట్ కార్డులు వస్తాయి. అవి రాగానే పెండింగ్‌లో ఉన్న ఆర్సీ డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించి స్మార్ట్ కార్డులను జారీ చేస్తాం.

30న బీసీ సంఘాల సమావేశం

గణేశ్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అన్ని రాజకీయ పార్టీలు బీసీ అభ్యర్థులకే టికెట్లు కేటాయించాలని ఈనెల 30న బీసీ సంఘాల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసిపేద్ది శ్రీధర్‌రాజు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు టికెట్లు కేటాయించిన వారికే తమ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

తిమ్మాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిళిపాలెం గ్రామ శివారులో సోమవారం ఓ ట్రాక్టర్ అదుపు తప్పి వ్యవసాయ పొలంలో బోల్తా పడింది. పర్లపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ బాగోతం కొమురయ్య మొగిళిపాలెం నుంచి కరీంపేటకు తీసుకొని వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి మొగిళిపాలెం గ్రామ శివారులో పాకాల శ్రీనివాస్ పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్ కొమురయ్య ట్రాక్టర్‌పై నుంచి దూకి తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

భగత్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రైవేట్, డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో ఆరేళ్ల నుంచి 8 వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తక్షణమే విడుదల చేయాలని లేకుంటే ఎస్ఎఫ్ఐ పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

రేపటి నుంచి కరీంనగర్-పూణేకు ప్రత్యేక రైలు



కరీంనగర్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి పుణే స్పెషల్ రైలును బుధవారం నుంచి నడిపించేందుకు రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. వారానికి ఒకసారి ఈ స్పెషల్ రైలు నడపనున్నారు. ప్రతి బుధవారం కరీంనగర్ రైల్వే స్టేషన్ నుంచి బయలు దేరి వయా పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్, బల్లర్షా, మాంజిరి, ఆదిలాబాద్ మీదుగా పుణేకు వెళ్తుంది. రైలు కరీంనగర్ నుంచి బుధవారం ఉదయం 6గంటలకు బయలు దేరి 7.15గంటలకు మంచిర్యాలకు, 8.50 గంటలకు కాగజ్‌నగర్‌కు, మధ్యాహ్నం 1.45 గంటలకు ఆదిలాబాద్‌కు చేరుకుంటుంది. గురువారం ఉదయం 9.45 గంటలకు పుణేకు చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు. పుణే రైల్వే స్టేషన్ నుంచి కరీంనగర్‌కు వచ్చే రైలు సోమవారం రాత్రి 10.46గంటలకు బయలు దేరి మంగళవారం సాయంత్రం 4గంటలకు ఆదిలాబాద్, రాత్రి 10.45 గంటలకు సిర్పూర్ కాగజ్‌నగర్‌కు, 11.45 గంటలకు మంచిర్యాలకు చేరుకుంటుంది. రైలు రాత్రి 12.50 గంటలకు కరీంనగర్‌కు చేరుకుటుందని అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలికి గాయాలు

చిగురుమామిడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లంపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ జోరబీ (70) అనే వృద్ధురాలు సోమ వారం విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయ పడింది. జోరబీ గ్రామ శివారులోని తుర్క కుంట వద్దకు కట్టెల కోసం వెళ్లింది. కుంట వద్ద వ్యవసాయ బావులకు సరఫరా అయ్యే విద్యుత్ తీగ తెగిపడింది. కుంట వద్ద కట్టెలు తీస్తున్న సమయంలో విద్యుత్‌వైర్ తాకి తీవ్రం గా గాయపడింది. దేవీ నవరాత్రుల సందర్భం గా అమ్మవారిని నిమజ్జనం చేయడానికి కుంట వద్దకు వెళ్లిన యువకులు గమనించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసి వృద్ధురాలిని ఆస్పత్రికి తరలించారు. గమనించకుండా యు వకులు నీటిలోకి దిగితే ప్రాణాపాయం ఉండే దని గ్రామస్థులు పేర్కొంటున్నారు. వృద్ధురాలికి విద్యుత్ శాఖ నుంచి వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.





వ్యర్థాలతో నిండిపోయిన తీగలగుట్టపల్లిలో ఎస్సారెస్పీ కాలువ, బొమ్మకల్ గ్రామ శివారులో ఎస్సారెస్పీ కాలువలో పడేసిన చెత్త చెదారం

కాలువల్లో కాలుష్యం

ఎస్సారెస్పీ కాలువల్లో వ్యర్థ పదార్థాలు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని ఎస్సారెస్పీ కాలువలు మురికి కూపాలుగా మారుతున్నాయి. చెత్త చెదారం, వ్యర్థాలతో కాలువలు కంపుకొడుతున్నాయి. మండలంలో పలు గ్రామాలను కలుపుతూ ఎస్సారెస్పీ కాలువలు ఉన్నాయి. ఈ కాలువల నుంచి ఆయా గ్రామాల్లోని పొలాల్లోకి సాగునీరు చేరుతుంది. కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లి, బొమ్మకల్ గ్రామాల్లోని కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. కొందరు కాలువలపై ఎలాంటి అనుమతులు లేకుండా కల్వర్టులను నిర్మిస్తున్నారు. తీగలగుట్టపల్లి, బొమ్మకల్ గ్రామ శివారులోని కాలువల్లో వ్యర్థ పదార్థాలను పడేస్తున్నారు. సంబంధిత అధికారులు కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను, పిచ్చి మొక్కలను తొలగించాలని, నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

గణేశ్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్లి గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను పరిష్కరించాలన్నారు.

అటవీశాఖ ఉద్యోగుల సస్పెన్షన్

జగిత్యాల క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జగిత్యాల అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో మద్యంతో విందు చేసుకున్న విషయంలో ఇద్దరు అధికారులపై సోమవారం వేటు పడింది. మరో ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఈ నెల 11న శుక్రవారం రాత్రి అటవీ శాఖ కార్యాలయ ఆవరణలోనే మైసమ్మ దేవత పేరుతో విందు చేసుకోవడం వివాదాస్పదంగా మారింది. ఈ వ్యవహారాన్ని అటవీశాఖ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ మేరకు జగిత్యాల డిప్యూటీ రేంజ్ అధికారి అరుణ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ నిర్మల్ జిల్లా బాసర సర్కిల్ అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ శరవణన్ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల డీఎఫ్‌వో రవిప్రసాద్ ముత్యంపేట బీట్ ఆఫీసర్ సాయిరాంను, మరో ఇద్దరిని సస్పెండ్ చేశారు.

లైఫ్‌స్టైల్

పల్లె.. పట్టణం.. తేడా లేకుండా మిద్దె తోటల ఏర్పాటుపై ఆసక్తి చూపుతున్నారు. ఎవరిళ్లపై వారు సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు చేస్తున్నారు. మొదటి రెండు సంవత్సరాలు పెట్టుబడి పెట్టాల్సి వచ్చినా దిగుబడి ప్రారంభమైన తర్వాత సంతోషపడుతున్నారు. ఇళ్లపైన మొక్కల పెంపకంతో ఇంటిలోపల ఉష్ణోగ్రత తగ్గిందని, స్వచ్ఛమైన గాలితో ఆరోగ్యంగా ఉంటున్నామని మిద్దెతోటలు పెంచుతున్నవారు అంటున్నారు.

పల్లె నుంచి పట్టణం వరకు

మిద్దెతోటల హవా



- ఇళ్లపై కూరగాయల సాగు
- సేంద్రియ పద్ధతుల్లో మొక్కల పెంపకం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 14: కరీంనగర్‌లో మిద్దెతోటల పెంపకం ఇటీవలి కాలంలో పెరిగింది. ఓపిక, తీరిక, కూరగాయలు, పండ్ల పెంపకంపై ఆసక్తి ఉంటే చాలు మిద్దెతోటల పెంపకాన్ని చేపట్టవచ్చు. సేంద్రియ విధానంలో మిద్దెతోటలో పంటల సాగుతో ఆరోగ్య కరమైన కూరగాయలు, ఫలాలు పొందుతున్నారు. కరీంనగర్‌కు చెందిన జనగాని యుగంధర్ తన ఇంటిపై మిద్దెతోట ఏర్పాటు చేసుకున్నాడు. ఐదేళ్లుగా మిద్దెతోటతో అనుబంధాన్ని పెంచుకున్నానని, ఇప్పుడు ఫలసాయం పొందుతున్నానని యుగంధర్ అంటున్నారు.

మూడంతస్థుల్లో.. ఖాళీ స్థలంలో..

జనగాని యుగంధర్ కరీంనగర్ టెలిఫోన్‌క్వార్టర్స్ ప్రాంతంలోని తన ఇంటి మూడంతస్థుల్లోని ఖాళీ ప్రదేశాలు, టెర్రస్‌పై మిద్దెతోటను నిర్వహిస్తున్నాడు. యుగంధర్, ఆయన భార్య రేణుక ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులైనప్పటికీ మిద్దతోటపై ఉన్న ఆసక్తితో బీర, కాకర, చిక్కుడు, టమాట వంటి 20 రకాల కూరగాయలు, 20 రకాల పండ్ల మొక్కలతోపాటు కంద గడ్డ వంటి దుంపలు, మిరియాలు, యాలకుల లాంటి సుగంధ ద్రవ్యాల మొక్కలు పెంచుతున్నారు. ఏడు రకాల ఆకుకూరలు, 13 రకాల ఔషధ మొక్కలను పెంచుతున్నాడు. మొదట 186 గజాల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోనే చిన్నగా టెర్రస్ గార్డెన్‌ను ప్రారంభించాడు. చుట్టూ ఇళ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మాణాలతో మొక్కలపై ఎండ పడకపోవడంతో సరిగా ఎదగలేదు. దీంతో రెండు అంతస్థుల్లో ఖాళీ ప్రదేశాలు బాల్కనీ, ఇతర చోట్ల మొక్కలు పెంచాడు. మూడో అంతస్థు టెర్రస్ మొత్తం కూరగాయలు, పూలు, ఔషధ మొక్కలు పెంచుతున్నాడు.వారింటికి సరిపడే కూరగాయలు మిద్దెతోటలోనే లభ్యమవుతున్నాయి. సీజన్‌లో కూరగాయలు ఎక్కువగా పండుతుండడంతో కాలనీవాసులకు పంపిణీ చేస్తున్నాడు.



ఔషధ మొక్కలు

ఇంటిపైన 20 రకాల కూరగాయలు

ముత్తారం: మిద్దెతోటలో భాగంగా సంప్రదాయ పద్ధతిలో ఇంటి పైనే సుమారు 20 రకాలకు పైగా కూరగాయలను సాగు చేస్తున్నారు ఓ మహిళ. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన గడ్డం శ్రీలతశ్రీధర్ మూడేళ్లుగా మిద్దెతోటలో చేపడుతున్న సాగు వివరాలు, విశేషాలు..

కూరగాయలు కావాలంటే మార్కెట్‌కు వెళ్తాం.. ఎక్కడ పండించారో, ఏయే ఎరువులు వాడారో తెలియకుండానే కొంటాం... వాటిలో వాడిపోయినవి, పుచ్చిపోయినవి ఉంటే ఎంతో అసహనానికి గురవుతాము. దీంతో గడ్డం శ్రీలతశ్రీధర్‌కు తానే ఆకు కూరలు, కూరగాయలు పండించాలనే ఆలోచన వచ్చింది. మిద్దెపై మొక్కల పెంపకం ప్రారంభించారు. కుటుంబ సంరక్షణ చూసుకుంటూనే సేంద్రియ వ్యవసాయంపై ఉన్న మక్కువతో మిద్దె తోట సాగుపై ఆసక్తి పెంచుకున్నారు. ఇంట్లో ఉండే పాత డబ్బాలు, ప్లాస్టిక్ బకెట్లు, థర్మకోల్ డబ్బాలనే కుండీలు ఉపయోగిస్తూ మొక్కలు పెంచుతున్నారు. ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా తమ ఇంటిపై ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. ఏ రోజుకారోజు ఇంటిల్లిపాది తినాలనుకున్న కూరగాయలు, ఆకుకూరలను ఆ తోట నుంచే సేకరిస్తున్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

సాధారణ గృహిణి అయిన గడ్డం శ్రీలతశ్రీధర్ మూడేళ్ల క్రితం సేంద్రియ పద్ధతిపై అవగాహన పెంచుకుని మిద్దె తోట ప్రారంభించారు. తమకున్న వెయ్యి చదరపు అడుగుల మిద్దెపై 700 చదరపు అడుగుల స్థలంలో మొదట ఆకు కూరల సాగు చేశారు. తర్వాత కూరగాయల సాగు ప్రారంభించారు. ఇప్పుడు ఇంట్లో పూర్తిగా ఆర్గానిక్ కూరగాయలనే వాడుతున్నారు. మిద్దె తోటలు పెంచడానికి పెద్దగా ఖర్చు కావడం లేదని, ఏడాదిలో నాలుగు నెలలు మినహా 8 నెలలు ఇంట్లో పండిన కూరగాయలనే వినియోగిస్తామని శ్రీలత తెలిపారు. దీంతో నెలకు సుమారు 4 వేల వరకు కూరగాయలు కొనకుండా ఆదా చేయవచ్చని చెబుతున్నారు.



మిద్దె తోటలో పండిన కూరగాయలను చూపిస్తున్న శ్రీలత

చిన్నప్పటి నుంచి వ్యవసాయంపై మక్కువ

జనగాం యుగంధర్, కరీంనగర్



మొక్కలకు నీరు పడుతున్న యుగంధర్

మాది కమలాపూర్ మండలం కనపర్తి. చిన్నప్పటి నుంచి వ్యవసాయం, గీత వృత్తి చేసేవాడిని. 1995లో ఉద్యోగం రావడంతో హైదరాబాద్ వెళ్లాను. 2014లో కరీంనగర్‌కు వచ్చిన తరువాత ఇంటి ఆవరణలోనే మొక్కలను పెంచాను. తరువాత ఇంటిపై మిద్దెతోటను ప్రారంభించాను. కరోనా సమయంలో మేము పండించిన తోట ఎంతో ఉపయోగపడింది. మాకు అవసరమైన కూరగాయలు, పండ్లు మిద్దె తోట ద్వారానే సమకూరాయి. సేంద్రియ పద్ధతిలోనే అన్ని మొక్కలు పెంచుతున్నాను. మిద్దెతోటలోని చెత్త, మొక్కల ఆకులతో డ్రై కంపోస్టును తయారు చేసి ఎరువుగా వాడుతున్నాను. కిచెన్ వేస్ట్‌జ్‌తో వెట్ కంపోస్టు తయారు చేసి చీడపీడలను నివారించేందుకు, మొక్కల పెరుగుదలకు వాడుతున్నాను. గులకరాళ్లు లేని ఎర్ర మట్టిలో విత్తనాలను నాటాలి. మంచిరకాల విత్తనాలు ఎంచుకోవాలి. మిద్దెతోట ఏర్పాటుకు 70 వేల వరకు ఖర్చయింది. ప్రస్తుతం నెలకు మూడు వేల ఆదాయం వస్తున్నది.

క్రైం కార్నర్

కట్టుకున్నోడే కడతేర్చాడు

- భార్యను హతమార్చిన నిందితుడి రిమాండ్

ఎల్లారెడ్డిపేట , అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భర్తే అతి కిరాతకంగా గొంతు నులిమి కడతేర్చాడు. ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. వీర్నపల్లి మండలం జవహర్‌నాయక్‌తండాలోని భార్యాభర్తలు గుగులోత్ సుశీల(42)- రవి మధ్య కొంత కాలంగా గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో సుశీల తన పిల్లలతో కలిసి లాల్‌సింగ్‌తండాలోని పుట్టింటికి వెళ్లింది. దసరా పండుగ సందర్భంగా అత్తిగారింటికి వెళ్లాలని పెద్దలు సుశీలకు సూచించారు. దీంతో ఆమె ఈ నెల 12న జవహర్‌నాయక్‌తండాకు చేరుకుంది. ఇంట్లో భార్యాభర్తలు మాత్రమే ఉన్నారు. అదే రోజు మద్యం తాగి ఇంటికి చేరుకున్న రవి భార్యతో గొడవ పడ్డాడు. తనను అనుమానించడం, సహకరించడం లేదనే అక్కసుతో అదే రోజు రాత్రి భార్యను తాడుతో గొంతు నులిమి చంపేశాడు. ఆమె ఆత్మహత్య చేసుకుందని నమ్మించేందుకు మృతదేహాన్ని ఇంటి బయటకు తీసుకొచ్చి పందిరికి వేలాడదీసేందుకు ప్రయత్నించాడు. ఫలించకపోవడంతో శవాన్ని ఇంటి ముందు ఉన్న మంచంపై వదిలి పారిపోయాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై ఎల్లాగౌడ్ ఈ నెల 13న ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు పారిపోయిన నిందితుడు రవి కోసం రెండు బృందాలుగా అటవీ ప్రాంతంలో గాలించారు. నిందితుడు రవి గుట్ట ప్రాంతంలో ఉన్నాడనే సమాచారంతో కానిస్టేబుల్ మల్లాగౌడ్ అక్కడకు చేరుకున్నారు. రంగంపేట బస్టాండు ప్రాంతంలో నిందితుడు రవిని అదుపులోకి తీసుకున్నారు. ఉరి వేయడానికి వినియోగించిన తాడును స్వాధీనపర్చుకున్నారు. విచారించడగా తన భార్యను గొంతు నులిమి చంపానని రవి అంగీకరించాడని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ మల్లాగౌడ్‌కు ఎస్పీ అఖిల్‌మహాజన్ రివార్డును అందజేశారని పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



ఆంజనేయులు

మానకొండూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ గ్రామానికి చెందిన ఎనగందుల ఆంజనేయులు (39) అనే వ్యక్తి అప్పుల బాధ భరించలేక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌కు చెందిన ఎనగందుల సౌజన్య-ఆంజనేయులు కుమారుడు అశ్వంత్, కుమార్తె అశ్విత ఉన్నారు. రెండేళ్ల క్రితం మానకొండూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య సౌజన్య, కుమారుడు అశ్వంత్ మృతి చెందారు. మృతురాలి సోదరి సంధ్యను రెండో వివాహం చేసుకొని కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. గతంలో చేసిన అప్పుల బాధతో పాటు భార్య, కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారనే మనస్తాపంతో పెరకబండలోని సశ్మాన వాటికలో మొదటి భార్య కుమారుల సమాధుల వద్ద సోమవారం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు, సోదరుడు మృతి చెందడంతో కుమార్తె అశ్విత అనాథగా మారిందని కాలనీవాసులు విలపించారు. రెండో భార్య సంధ్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రాణాలు తీసిన అతివేగం

- ద్విచక్రవాహనం చెట్టు ఢీకొని ఇద్దరు యువకుల మృతి



విక్కుర్తి దిలీప్ , సురా అనిల్ (ఫైల్)

వేములవాడ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అతి వేగం ఇద్దరు యువకుల ప్రాణాలను బలిగొంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటకు చెందిన విక్కుర్తి దిలీప్ (22), సురా అనిల్ (21) ఇద్దరు స్నేహితులు. ఆదివారం రాత్రి గ్రామంలో నిర్వహించిన దుర్గామాత నిమజ్జన వేడుకలకు హాజరయ్యారు. అనంతరం నూతనంగా కొనుగోలు చేసిన బైక్‌పై ఇద్దరు సరదాగా మామిడిపల్లి రహదారి వైపు వెళ్లారు. బైక్ అతివేగంగా ఉండడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ తీవ్రగాయాలపాలయ్యారు. అటువైపుగా వెళ్తున్న పెట్రోలింగ్ పోలీసులు వారిని అదే వాహనంలో ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమించిందనడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చేతికి అందివచ్చిన కొడుకులు మృతి చెందడంతో పండగపూట రెండు కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

దాడి చేసిన నలుగురిపై కేసు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం వావిలాల గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామంలో నలుగురు వ్యక్తులు మద్యం సేవించి ఇంటి మీదకు వచ్చి తలుపులు ధ్వంసం చేసి, అడ్డు వచ్చిన తన భర్తను కింద పడేసి గాయపరిచారని ఐలాపురం మౌనిక సోమవారం పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. తమ మరిది హరీష్ గ్రామానికి చెందిన ఉడుత గట్టయ్యతో గొడవ పెట్టుకున్నాడని, ఆ విషయాన్ని మనుసులో పెట్టుకున్న గట్టయ్య అతడి కుమారుడు కిరణ్, బంధువులు హరీష్, ప్రశాంత్‌లను వెంట పెట్టుకుని తమ ఇంటి మీదకు వచ్చాడని, తులుపులు తీయకుంటే తన్నారని, అడ్డు వచ్చిన తన భర్త మహేష్‌ను కింద పడేసి కొట్టారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

హుజూరాబాద్ ఆస్పత్రిలో అందుబాటులోని లేని మత్తు వైద్యుడు

- ప్రసవం కోసం గర్భిణుల పడిగాపులు
- 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన వైద్యులు

హుజూరాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో మత్తు వైద్యుడు సమయానికి రాకపోవడంతో సోమవారం ప్రసవం కోసం వచ్చిన గర్భిణిలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దసరాకు ముందు ఆరుగురు గర్భిణులు పరీక్షల కోసం ఏరియా ఆస్పత్రికి రాగా, పరీక్షించిన గైనాకాలజిస్టు సోమవారం సాయంత్రం ఆరు గంటలకు రమ్మని చెప్పారు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకే గర్భిణిలు ఆస్పత్రికి చేరుకున్నారు. వైద్యురాలు నార్మల్ డెలివరీ కోసం వీరిని ఆస్పత్రిలో చేర్పించుకున్నారు. గర్భిణులకు నొప్పులు ఎక్కువ కావడంతో ఆపరేషన్ చేయాలని వైద్యురాలిని కుటుంబ సభ్యులు అడిగారు. దీనికి సదరు వైద్యురాలు మత్తు డాక్టర్ జమ్మికుంట ప్రభుత్వాస్పత్రిలో శస్త్ర చికిత్స కోసం వెళ్లాడని, అతను వచ్చిన తర్వాత చేస్తానని చెప్పారు. గర్భిణులకు నొప్పులు ఎక్కువ కావడంతో ఆపరేషన్ చేయాలని కుటుంబ సభ్యులు వైద్యురాలిని అడిగారు. దీనికి సదరు వైద్యురాలు మత్తు డాక్టర్ జమ్మికుంట ప్రభుత్వాస్పత్రిలో శస్త్ర చికిత్స కోసం వెళ్లాడని, అతను వచ్చిన తర్వాత ఆపరేషన్ చేస్తామని తెలిపారు. ఈ విషయం ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ప్రసారం కావడంతో స్పందించిన జిల్లా వైద్య శాఖాధికారులు హుటాహుటిన మత్తు డాక్టర్‌ను పిలిపించి సాయంత్రం గర్భిణులకు ఆపరేషన్ నిర్వహించారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా గర్భిణిలను సాయంత్రం ఆరు గంటలకు రమ్మంటే ముందుగా వచ్చారన్నారు. నార్మల్ డెలివరీ కోసం వైద్యురాలు ప్రయత్నించారన్నారు. హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో నలుగురు మత్తు వైద్యులు ఉండగా మారిలో ముగ్గురు బదిలీపై వెళ్లారని, వారి స్థానంలో ఎవరూ రాలేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఒక్క డాక్టర్ జమ్మికుంట, హుజూరాబాద్ ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నాడని చెప్పారు.



- వైద్యుల కొరత

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో 23మంది వైద్యులు ఉండగా, మత్తు డాక్టర్లు ముగ్గురు బదిలీల్లో భాగంగా మూడు నెలల క్రితం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వారి స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఒకరు మాత్రమే మత్తు డాక్టర్ ఉండగా, హుజూరాబాద్, జమ్మికుంట ప్రభుత్వాస్పత్రులను చూసుకుంటున్నారు. ఏరియా ఆస్పత్రిలో నలుగురు గైనాకాలజిస్టుకు బదులుగా ముగ్గురు మాత్రమే ఉన్నారు. బదిలీపై వెళ్లిన వారి స్థానంలో ఎవరినీ నియమించలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అప్పన్నపేటలో 'పుష్ప' విలన్

మలయాళ హీరో ఫాహద్ ఫాజిల్ పోలికలతో గుర్తింపు పొందుతున్న జానపద కళాకారుడు

ఇన్‌స్టా రీల్స్‌తో వెలుగులోకి వస్తున్న ప్రతిభ



ఉడిపిలో జరిగిన ఈవెంట్‌లో ఫాహద్‌ఫాజిల్ వేషధారణలో అడప మహేష్ (ఫైల్)

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా అప్పన్నపేటకు వెళితే అక్కడ మీకు పుష్ప సినిమా విలన్, మలయాళ హీరో ఫాహద్ ఫాజిల్ కనిపిస్తాడు. అంతటి హీరో ఇక్కడున్నాడేంటా అని పరిశీలించి చూస్తే ఆయన ఫాహద్ ఫాజిల్ కాదు.. అప్పన్నపేటకు చెందిన అడప మహేష్ అని గుర్తిస్తారు. మహేష్ ఓ జానపద కళాకారుడు. డ్రైవర్‌గా పని చేస్తూ ఖాళీ సమయాల్లో జానపద వీడియో ఆల్బమ్‌లు, షార్ట్ ఫిలిమ్స్‌లో నటిస్తున్నాడు. మహేష్ మలయాళ హీరో ఫాహద్ ఫాజిల్ పోలికలతో ఉంటాడు. పుష్ప సినిమా తర్వాత అందరూ 'మహేష్‌ను పార్టీ లేదా పుష్ప' అంటూ ఆటపట్టించడం ప్రారంభించారు. దీంతో దానిని తనకు అనుకూలంగా మార్చుకున్న మహేష్ ఇన్‌స్టాగ్రాంలో రీల్స్ చేయడం ప్రారంభించాడు. ఈ రీల్స్ చూసిన కన్నడ చిత్రసీమకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ ఒకరు మహేష్‌కు సినిమాల్లో అవకాశం ఇస్తానని మాట ఇచ్చాడు. కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి పట్టణంలో జరిగే ఓ ఈవెంట్‌కు మహేష్‌ను ఆహ్వానించాడు. అక్కడ మహేష్ ఆవేశం సినిమాలో ఫాహద్ ఫాజిల్ వేసిన గెటప్ లో అందరినీ అలరించాడు. అక్కడికి వచ్చిన వారందరూ ఫాహద్ ఫాజిలే వచ్చాడా.. అని ఆశ్చర్యపోయారు.

మంచినీటి సహాయకులొస్తున్నారు

- రక్షిత తాగునీటి సరఫరా కోసం శిక్షణ..
- పరిష్కారం కానున్న నీటి సమస్యలు

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు పగిలి నీరు కలుషితమై ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. తాగు నీరు పెద్ద మొత్తంలో వృథా అవుతోంది. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఓ ఆలోచన చేసింది. ప్రతి గ్రామానికి మంచినీటి సహాయకుడిని నియమించాలని నిర్ణయించింది. చిన్న పంచాయతీలకు ఒక కార్మికుడిని, మేజర్ గ్రామపంచాయతలకు ఇద్దరిని ఎంపిక చసి నల్ జల్ మిత్ర పథకంలో భాగంగా శిక్షణ ఇచ్చింది.

- మంచినీటి సహాయకుల బాధ్యతలు

మంచినీటి సహాయకులు గ్రామాల్లో చేతిపంపులు, విద్యుత్ మోటార్లకు సంబంధించిన చిన్న చిన్న మరమ్మతులు చేయాలి. ఎక్కడైనా లీకేజీలు ఉంటే అరికట్టాలి. నిత్యం నీటి నాణ్యతను పరిశీలించాలి. ఈ అంశాల్లో వారికి శిక్షణ ఇచ్చారు. నెలలో మూడుసార్లు నీటి ట్యాంకులను(1వ, 10వ, 21వ తేదీ) కడగాలి. నిత్యం క్లోరిన్ పరీక్షలు చేయాలి. ట్యాంకుకు ఎక్కించిన నీటిలో క్లోరిన్ 2 పీపీఎం ఉండాలి. తక్కువ ఉంటే బక్కెట్ నీటిలో 40 గ్రాముల బ్లీచింగ్ కలిపి 15 నిమిషాల తర్వాత నీటి ట్యాంకుల్లో పోయాలి. అరగంట తరువాత నీటిని విడుదల చేయాలి. ట్యాంకు దగ్గరి మొదటి ఇంటి వద్ద ఇచ్చిన క్లోరోస్కోప్ ద్వారా నీటి నాణ్యత పరీక్షించాల్సి ఉంటుంది. గతంలో తాగునీటి పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడినా, మరమ్మతుల కోసం సంబంధిత మెకానిక్‌లు వచ్చే వరకు ఆగాల్సి వచ్చేది. కొన్ని సందర్భాల్లో నెలల తరబడి మరమ్మతులకు నోచుకోకుండా నీరు వృథాగా పోయేది. ప్రస్తుతం ప్రతి గ్రామానికి సహాయకుడు ఉండడంతో సమస్యను పరిష్కారించే అవకాశం ఉంటుంది. సమస్య తీవ్రంగా ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళతారు.



ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న అధికారులు (ఫైల్)



గ్రామ స్థాయిలోనే తాగునీటి సమస్య పరిష్కారం

-తూర్పాటి సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్

మంచినీటి సహాయకులతో గ్రామ స్థాయిలోనే తాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఇప్పటికే సహాయకులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చాం. ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయం.

దాడి చేసిన నలుగురిపై కేసు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం వావిలాల గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామంలో నలుగురు వ్యక్తులు మద్యం సేవించి ఇంటి మీదకు వచ్చి తలుపులు ధ్వంసం చేసి, అడ్డు వచ్చిన తన భర్తను కింద పడేసి గాయపరిచారని ఐలాపురం మౌనిక సోమవారం పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. తమ మరిది హరీష్ గ్రామానికి చెందిన ఉడుత గట్టయ్యతో గొడవ పెట్టుకున్నాడని, ఆ విషయాన్ని మనుసులో పెట్టుకున్న గట్టయ్య అతడి కుమారుడు కిరణ్, బంధువులు హరీష్, ప్రశాంత్‌లను వెంట పెట్టుకుని తమ ఇంటి మీదకు వచ్చాడని, తులపులు తీయకుంటే తన్నారని, అడ్డు వచ్చిన తన భర్త మహేష్‌ను కింద పడేసి కొట్టారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

బీరు సీసతో దాడి.. కేసు నమోదు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం వావిలాల గ్రామానికి చెందిన ఐలాపురం హరీష్ అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లిస్తానని ఇంటికి పిలిచి బీరు సీసాతో గాయపరిచాడని బాధితుడు ఉడుత గట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

వ్యవసాయ విద్యుత్ మోటార్లు మాయం

శంకరపట్నం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్కండ్ల వాగులో నుంచి పంట పొలాలకు నీరు అందించేందుకు రైతులు విద్యుత్ మోటర్లను అమర్చుకున్నారు. ఇద్దరు రైతులకు చెందిన విద్యుత్ మోటర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధిత రైతులు నేదురు భూమయ్య, చిలువేరి చంద్రయ్య, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి 10గంటల వరకు వ్యవసాయ బావి వద్ద పనులు ము గించుకొని తిరిగి వెళ్లారు. సోమవారం ఉదయం 6గంటలకు పొలం వద్దకు వెళ్లేసరికి తన మోటార్లను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడికి గాయాలు

తిమ్మాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వరంగల్ వైపు నుంచి నిజామాబాద్ వెళుతుండగా అలుగునూర్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెలుతున్న కన్నం వినయ్(15) అనే బాలుడికి ఢీకొంది. ఈ ప్రమాదంలో వినయ్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు బాలుడిని అసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎల్ఎండీ పోలీసులు కేసును దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

పెగడపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని మ్యాకవెంకయ్యపల్లి గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామడుగు మండలం గోపాల్‌రావు పేట గ్రామానికి చెందిన అలువాల విష్ణు అతడి భార్య రమ్యతో కలిసి ఆదివారం రాత్రి ఏపీ9 ఏజడ్ 5832 నెంబరు గల బైక్‌పై గోపాల్‌రావు పేట నుంచి పెగడపల్లికి వస్తుండగా మ్యాకవెంకయ్యపల్లి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఏపి 25 క్యూ 8256 నెంబరు గల వాహనంతో అతి వేగంగా నడుపుకుంటూ వచ్చి ఢీకొట్టాడు. దీంతో విష్ణు రమ్యలు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. రమ్య పరిస్థితి విషమంగా ఉందని, విష్ణుకు తీవ్ర గాయాలయ్యాయని విష్ణు తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

నేడు ఉపాధ్యాయులకు పోస్టింగ్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియం నందు ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని డీఈవో సూచించారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

సుభాష్‌నగర్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మేము సైతం యువసేన ఫౌండే షన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టేషనరీ పంపిణి చేశారు. ఫౌండే షన్ సభ్యులు బండ సంధ్యారాణి, శివకుమార్‌ల కుమారుడు బండ కౌశిల్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు స్టేషనరీతో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న పాల్గొన్నారు.

ద్వాదశి అభిషేకం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని యజ్ఞవరాహ క్షేత్రంలో సోమవారం దసరా అనంతరం వచ్చిన శుద్ధ ద్వాదశి సందర్భంగా ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పారమిత విద్యార్థి ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 17 వరకు జోగులాంబ గద్వాలలో నిర్వహించనున్న అండర్-14 బాలుర క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలకు నగరంలోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన పి కేదార్‌నాథ్ ఎంపికయ్యాడు. ఈ నెల 4న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభచాటిన కేదార్‌నాథ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మంతరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని చైర్మన్ ప్రసాదరావు తదితరులు అభినందించారు.

స్మార్ట్‌సిటీ పనులను త్వరగా పూర్తి చేయండి

కరీంనగర్ టౌన్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : నగరంలో చేపడుతున్న స్మార్ట్‌సిటీ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట చేపడుతున్న జంక్షన్ సుందరీకరణ పనులను, అంబేద్కర్ స్టేడియంలో కాంప్లెక్సు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ పనులను వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.



జంక్షన్ సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, ట్రైనీ కలెక్టర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● **ఈవీఎం గోదాములను తనిఖీ**

జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీలు తీయించి గదిలో ఉన్న ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పరిశీలించారు. తర్వాత సీలు వేయించి పలు సూచనలు చేశారు.

● **ప్రజావాణికి 127 దరఖాస్తులు**

సుభాష్‌నగర్: ప్రజావాణికి 127 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పమేలాసత్పతి తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమె అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాని ఆదేశించారు.

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు

-వృథాగా వ్యవసాయ మార్కెట్ వారసంత



మొగ్దుంపూర్‌లోని నిరుపయోగంగా వ్యవసాయ మార్కెట్

కరీంనగర్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థుల సౌకర్యార్థం కోసం గ్రామాల్లో కూరగాయల మార్కెట్‌లను నిర్మించినప్పటికీ ఆదరణ కరువవడంతో అవి కాస్తా వృథాగా పోతున్నాయి. కరీంనగర్ మండలం మొగ్దుంపూర్, నగునూర్ గ్రామాల్లో వారసంత, కూరగాయల మార్కెట్‌కు నిధులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పనులను చేపట్టింది. ఇందుకు గాను ఉపాధిహామీ ద్వారా మిగతావి గ్రామ పంచాయతీల నుంచి నిధులను మంజూరు చేసింది. మొగ్దుంపూర్‌లో ఉపాధిహామీ నిధులు 9లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు 3.25లక్షలతో సంత నిర్మాణపు పనులను పూర్తి చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి మంత్రి గంగుల కమలాకర్ పల్లె సంతను ప్రారంభించారు. మొగ్దుంపూర్‌లోని పల్లె సంత ఆరు గ్రామాలకు అందుబాటులో ఉంటుంది. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి, సాబయ్యపల్లి, నారాయణపల్లె, దుబ్బపల్లి కరీంనగర్ మండలంలోని మందులపల్లి, చెర్లబూత్కూర్ గ్రామంలో సమీపంలో ఉంటుంది. నిర్మాణం పూర్తయి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఆదరణకు నోచుకోలేదు. గ్రామస్థుల సౌకర్యార్థం లక్షలు వెచ్చించిన ఈ కూరగాయల మార్కెట్, వారసంత ప్రస్తుతం వృథాగా మారింది. అన్ని హంగులతో నిర్మించినప్పటికి దీనిని నిర్లక్ష్యంగా వదిలేశారు. వారసంతను, కూరగాయల మార్కెట్‌ను ఉపయోగంలోకి తెచ్చేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి'

సుభాష్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ కాంపెన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ గూడూరి స్వామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి నేటికి 19 ఏళ్లు పూర్తి అయిందన్నారు. ఒక్కో కమిషనర్ నెలకు 400 నుంచి 500 వరకు కేసులు పరిష్కరించాలని, కాని నెలకు 50 నుంచి 100 కేసులు మాత్రమే పరిష్కరిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని పదవ తరగతి పాఠ్యాంశంలో చేర్చాలని కోరారు. ఈ సమావేశంలో రావుల రాజేశం, తులసి లక్ష్మణమూర్తి, ఆకుల రాజేశ్వర్‌రావు, గూడూరి చైతన్యరెడ్డి, బండ లక్ష్మారెడ్డి, చందు శేఖర్, నంది తిరుపతిరెడ్డి, ఇరుమళ్ల సురేందర్‌రెడ్డి, దొమ్మటి బాబు, మాసం సుధాకర్, పల్లెల దేవరాజ్, గూటం సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో రూపొందించనున్న కథల ముచ్చట్లు పోస్టర్‌ను సోమవారం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ నివాసంలో ఆయన, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల వేంకటేశ్వర్లుతో కలసి ఆవిష్కరించారు. ఈ నెల 17న పెద్దపల్లి కలెక్టరేట్ ప్రాంగణంలో, పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్ ఆతిథ్యంలో జరుగనున్న కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిషన్ నోటీసులు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిషన్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలతచంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్ చంద్రశేఖర్ మున్సిపల్ కమిషనర్‌పై చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిషన్ ఇటీవలనే జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్‌లకు విచారణ జరిపి చర్య తీసుకోవాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, తాజాగా కమిషనర్‌కు కూడా నోటీసులు పంపించినట్లు సమాచారం.

రాష్ట్ర స్థాయి క్రీడలకు అల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక

భగత్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్, నెట్‌బాల్ పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. సోమవారం అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులకు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల కొత్తపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో నెట్‌బాల్‌లో జి ఎలిన జోన్న షారూన్, ఎంరక్షిత, హ్యాండ్‌బాల్‌లో జి ఎలిన జోన్న షారూన్‌లు ఎంపికయ్యారన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

రెజ్లింగ్‌లో ట్రినిటి కళాశాల విద్యార్థి ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గత నెల 30న జరిగిన జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభచాటిన ట్రినిటి కళాశాల విద్యార్థి సీహెచ్ విద్యార్థి ఈ నెల 15 నుంచి 17 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల వ్యవస్థాపకులు చైర్మన్ మనోహర్ రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.



ఆదిత్యను అభినందిస్తున్న ట్రినిటీ కళాశాల వ్యవస్థాపకులు మనోహర్‌రెడ్డి

'ప్రొఫెసర్ సాయిబాబా మృతి తీరని లోటు'

భగత్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ సాయిబాబా మృతి మానవ హక్కుల ఉద్యమానికి తీరని లోటని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు అన్నారు. తొంభై శాతం అంగవైకల్యంతో ఉన్న ఆయనపై నక్సలైట్‌గా ముద్ర వేసి ఉపా చట్టం కింద జైల్లో పెట్టి దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. జైల్లో ఉన్న సమ యంలో ఆయన తల్లి మరణిస్తే బెయిల్ కూడా ఇవ్వకుండా ప్రభుత్వం వేధించిందన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను కలిసిన టీఎన్‌జీవో నాయకులు

సుభాష్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టిన సత్తు మల్లయ్యను టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఎన్‌జీవో నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, నాగుల నర్సింహస్వామి, రాగి శ్రీనివాస్, ఒంటెల రవీందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం కార్యదర్శి శంకర్, రాజమల్లయ్య, సరిత, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చండీ హోమం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాయత్రీనగర్ గణేశ శారదా శంకరాలయంలో సోమవారం మూగు నాగన్న ఆధ్వర్యంలో చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమా నికి తోగుట, రంగంపేట పీఠాధిపతి మాధవానంద సర స్వతీ స్వామి హాజరై ఆలయంలో అమ్మవారికి పూజలు జరిపి, హోమంలో పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఒకరిపై కేసు

గంగాధర, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం వెంకటయ్యపల్లికి చెందిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం ఆదివారం దుర్గాదేవి నిమజ్జన సమయంలో రావుల సత్తయ్య అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన రావుల సత్యానారాయణపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సన్న వడ్లకు రూ.500 బోనస్ : ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): సన్న రకం వరి సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, అదనంగా ప్రభుత్వం 500రూపాయల బోనస్ ఇస్తుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని రేణికుంట గ్రామంలో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌తో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సన్న రకం వరి సాగుపై మక్కువ చేలని కొరారు. సన్న రకం బియ్యాన్ని వాడేందుకు ప్రజలు ఇష్టపడుతున్నందున రైతులు కూడా సన్న రకం వరి సాగుపై దృష్టి సారించాలని కోరారు. రైతులు పండించిన వరి ధాన్యం అమ్మకాల కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తోందని గుర్తు చేశారు. రైతుల డిమాండ్ మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ మాట్లాడుతూ ధాన్యం తూకాల్లో మోసాలకు తావు లేదని, తాలు తరుగు పేరిట ఎలాంటి కటింగులు ఉండవని, ఒకవేళా అలాంటివి చేస్తే తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణా రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు తెలకపల్లి రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

క్రీడలు ప్రతిభను వెలికి తీస్తాయి

శంకరపట్నం, అక్టోబరు 14: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడా పోటీలు క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తాయని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం శంకరపట్నం మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గాజుల నందన్ స్మారకార్థం నందన్ తల్లిదండ్రులు గాజుల రమాదేవి-శ్రీనివాస్‌లు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. నందన్ ఆకస్మికంగా మృతి చెందడం కుటుంబానికి తీరని లోటన్నారు. ప్రతి ఆటలో గెలుపు ఓటములు సహజమేనన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా నందన్ జ్ఞాపకాలు ఎప్పుడు ప్రజల మధ్యలో ఉంటాయన్నారు. అనంతరం పోటీల్లో గెలిచిన జట్లకు ఎమ్మెల్యే బహుమతులు ప్రధానం చేశారు. ప్రథమ స్థాయిలో నిలిచిన కేశవపట్నంకు చెందిన చోటు 11 టీమ్‌కు రూ. 20,016 నగదు, ట్రోఫి అందజేశారు. ద్వితీయ బహుమతి నుస్తులాపూర్ టీమ్‌కు రూ. 10,016వేల నగదు, ట్రోఫి, తృతీయ బహుమతి అన్నారం రూ. 5016నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మానకొండూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాజుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, పాఠశాల శాశ్వత కమిటీ సభ్యులు తణుకు ఓంకారం, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, క్రీడాకారులు, కేశవపట్నం ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'కాసం' విజేతకు టీవీఎస్ బైక్

జమ్మికుంట రూరల్, అక్టోబరు 14: జమ్మికుంట పట్టణంలోని కాసం బట్టల షాపులో దసరా సందర్భంగా సోమవారం తీసిన లక్కీడ్రాలో ఓ వ్యక్తి టీవీఎస్ బైక్‌ను గెలుచుకున్నాడు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు చేతుల మీదుగా లక్కీడ్రా తీశారు. ఇల్లందకుంట మండలం సీతంపేట గ్రామానికి చెందిన సురేష్ లక్కీడ్రాలో విజేతగా నిలిచాడు. విజేతకు టీవీఎస్ బైక్‌ను మంగళవారం అందజేయనున్నారు. చైర్మన్ రాజేశ్వర్‌రావు మాట్లాడు తూ కాసం బట్టల షాపులో ప్రతి ఐదు వందల రూపాయల కొనుగోలుపై ఉచిత కూపన్లు అందజేయ డం మంచి విషయం అన్నారు. జమ్మికుంటలో కాసం బట్టల షాపు నెలకొల్పిన కొద్ది రోజుల్లోనే ప్రజల మన్నలను పొందిందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహేందర్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



విజేతను ప్రకటిస్తున్న మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు సన్మానం

రామడుగు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మహిళ కమిషన్ చైర్ పర్సన్‌గా నియామకమైన నేరేళ్ల శారదను మండలంలోని వెదిర గ్రామంలోని పీఆర్‌టీయూ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కారించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ముసుకు తిరుపతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్యాద మల్లారెడ్డి, గంగాధర, రామడుగు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చాడ శ్రీనివాస్‌ఎడ్డి, రామిడి సత్యనారాయణరెడ్డి, శ్యాంసుందర్‌లు ఉన్నారు.



మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మీసేవ కేంద్రాల నిర్వాహకులపై ఫిర్యాదు

గన్నేరువరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దరఖాస్తు దారుల నుంచి సర్టిఫికెట్‌లపై అదనపు డబ్బులు తీసుకుంటున్న మీసేవ నిర్వాహ కులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని మాధాపూర్ గ్రామానికి చెందిన సంపతి ఉదయ్‌కుమార్ సోమవారం తహసీల్దార్ ఇప్ప నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయం, నివాసం, కుల ధృవీకరణ పత్రాల దరఖాస్తు కోసం రూ.45 చెల్లించాల్సిన రుసుం కంటే అదనంగా మరో 60 రూపాయలను మీసేవ నిర్వాహకులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు.

నేటి నుంచి గాలికుంటు టీకాలు

మానకొండూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం నుంచి నవంబరు 7 వరకు పశువులకు గాలికుంటు టీకాల వేయనున్నట్లు మండల పశువైద్యులు అరవిందరెడ్డి, సుశ్మితారెడ్డి తెలిపారు.

● సైదాపూర్: సైదాపూర్ మండలంలోని అన్ని గ్రామాలలో ఈ నెల 15 నుంచి నవంబరు 14 వరకు పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి సీహెచ్ విజేందర్‌రావు తెలిపారు. ఈ నెల 15న వెన్కెపల్లి, 16న సైదాపూర్, 17న దుద్దెనపల్లి, 18న జాగీర్‌పల్లి, 19న వెన్నంపల్లి, 21న ఆరెపల్లి, లస్మన్నపల్లి, 22న సోమారం, 23న రాంచంద్రాపూర్, 24, 25న ఎక్లాస్‌పూర్, 26న ఘన్‌పూర్, 28న వెంకటేశ్వర్లపల్లి, 29, 30న ఆకునూర్, నవంబరు 1న సర్వాయిపేట, 2న పెర్కపల్లి, గొల్లగూడెం, 4, 5న రాయికల్, 6న రాయికల్‌తండా, 7న గొడిశాల, నల్లరామయ్యపల్లి, 8న రాములపల్లి, 9న బొమ్మకల్, 11న గుజ్జులపల్లి, 12న ఎల్లంపల్లి, 13న ఎలబోతారం, 14న అమ్మనగుర్తి, గుండ్లపల్లిలో టీకాలు వేస్తామన్నారు.

●శంకరపట్నం: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ బిళ్లకంటి మాధవరావు సోమవారం తెలిపారు.

● హుజూరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యో తి): హుజూరాబాద్‌కు చెందిన టీజేఏసీ నాయకులు సోమవారం సికింద్రాబాద్‌లోని మౌలాలీలో ప్రొఫెసర్ సాయిబాబా పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. సాయిబాబా బడుగు బలహీనవర్గాల ప్రజలకు సేవలందించాని వారు కొనియాడారు. కార్యక్రమంలో రఘుశంకర్‌రెడ్డి, టి లింగారెడ్డి, ఎ శ్రీనివాస్‌రెడ్డి, సోమయ్య, రమాదేవి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే

రామడుగు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన అమిరిశెట్టి సుస్మిత బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడికల్ సర్జరీ పట్టా అందుకోగా సోమవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలుసుకున్నారు. ఈ మేరకు డాక్టరేట్ సాధించిన సుస్మితను ఎమ్మెల్యే అభినందించి పుష్పగుచ్ఛం అందజేశారు. సుస్మిత కర్ణాటకలోని ఉస్మానాబాద్ రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ నుంచి పట్టాఅందుకున్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

రామడుగు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత అల్వాల విష్ణు దంపతులు ఆదివారం పెగడపల్లి మండలం మేక వెంకయ్యపల్లిలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విష్ణు భార్య రమ్య బ్రెయిన్ డెడ్ కావడంతో సోమవారం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌లు దంపతులను పరామర్శించారు.

విగ్రహం ధ్వంసంపై నిరసన

హుజూరాబాద్, అక్టోబరు 14 ఆంధ్రజ్యోతి): : వరంగల్ జిల్లా దేశాయిపేటలో మహాత్మ జ్యోతిరావుఫూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ఫూలే ఉత్సవ కమిటీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో వెంకన్న, జనార్దన్, స్వామి, ఓదెలు, రవి, అశోక్ పాల్గొన్నారు.

యజమానిపై బెంగతో శునకం మృత్యువాత

జమ్మికుంట, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి): ప్రతి రోజు తనతో గడిపే యజమాని కనిపించక పోవడంతో ఆ శునకం ఒంటరిగా మిగిలింది. సరిగా ఆహారం తీసుకోకపోవడంతో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, దివంగత తుమ్మేటి సమ్మిరెడ్డి పెంపుడు శునకం సోమవారం మృతి చెందింది. జమ్మికుంట పట్టణానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి సెప్టెంబర్ 14న మృతి చెందాడు. నెల తిరుగక ముందే తాను అల్లారు ముద్దుగా పెంచుకున్న క్యాచ్‌ఫర్ (ల్యాబ్) శునకం మృత్యువాత పడింది. శునకాలు అంటే సమ్మిరెడ్డికి ఎంతో ఇష్టం. వాటిలో క్యాచ్‌ఫర్‌తో ఆయనకు పన్నెండేళ్ల విడదీయని అనుబంధం. సమ్మిరెడ్డి ఎటు వెళ్లినా తన వాహనంలో ఉంటుంది. ఆయన మృతి చెందిన నాటి నుంచి ముభావంగా ఉంటోందని, యజమాని కనిపించనే మృతి చెంది ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు.



సమ్మిరెడ్డి చిత్రపటం వద్ద శునకం(ఫైల్)

ఆరు గ్యారంటీలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

● **బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**

వీణవంక 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు.సోమవారం మండలంలోని గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గోన్నారు.ఈ సందార్భంగు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అదికారంలోకి వచ్చి 300 రోజులు గడిచిన ఎన్నికలలో ఇచ్చిన హమీలు నేరవేర్చటంలో విఫలమయ్యరని ప్రజా వ్యతిరేఖతను ముటగట్టుకున్నారని అన్నారు.రైతులకు రైతు భరోస,మహిళలకు 2500 వంటి హమీలను ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన ప్రభుత్వం మాట తప్పరని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామిడి అదిరెడ్డి,నాయకులు చెన్నమాధవుని నర్సింహరాజు,సదానందం సారయ్యస్వామి,తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని మోదీ చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీజేపీ సభ్యత్వ నమోదు చేసుకుంటున్నార న్నారు. కార్యక్రమంలో నాయకులు మాడ గౌతమ్‌రెడ్డి ఉన్నారు.

పెన్షన్‌దారుల్లో అనర్హులను గుర్తించాలి

గన్నేరువరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్నటువంటి అనర్హులైన పెన్షన్‌దారులను గుర్తించి వెంటనే తొలగించాలని మండల సీపీఐ నాయకులు ఎంపీడీవో శ్రీనివాస్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అనర్హుల పెన్షన్‌లను తొలగించాలని సీఎం ఆదేశించారని గుర్తు చేశారు. మండలంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారి కుటుంబంలో కూడా పెన్షన్ లను పొందుతున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు స్పందించి వెంటనే అనర్హులను గుర్తించి అసలైన అర్హులకు పెన్షన్ అందేలా చూడాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవోకు వినతిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయకార్యదర్శి చొక్కల్ల శ్రీశైలం, నాయకులు గర్శకుర్తి శ్రీనివాస్, కూన మల్లయ్య, కూన కిష్టయ్య మల్లయ్య, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.